

# అన్నదాతల అరిగోస





### ● ఐదో బోర్లోనూ చుక్క నీరు రాలే..



నాకు 2.20 ఎకరాల భూమి ఉన్నది. అందులోని ఎకరంన్నరలో జొన్న, మిగిలిన భూమిలో పశుగ్రాసాన్ని పెంచుతున్నా. నా దగ్గర 7 బర్రెలు ఉండేవి. నాలుగేండ్ల కిందట ఒక బోరు వేస్తే నీరు రాకపోవడంతో రూ.3.60 లక్షలతో బావిని తవ్వించగా కొంతవరకు నీళ్లు వచ్చాయి. వాటితో పశుగ్రాసాన్ని సాగు చేస్తూ బర్రెలను మేపుతున్నా. నీరు లేకపోవడంతో గతేడాది ఒకే సారి రెండు బోర్లు 620, 650 ఫీట్లు వేయించినా నీరు రాకపోవడంతో పశుగ్రాసం పెరగకపోవడంతో జనవరిలో 2 బర్రెలు, ఫిబ్రవరిలో మరో 2 బర్రెలను అమ్మేసిన. నాలుగు నెలల కిందట కేబీఎస్ బ్యాంకులో రూ.లక్ష, సొసైటీ బ్యాంకులో రూ.1.20 లక్షలు లోన్ తీసుకొని రెండు బర్రెలను కొన్నా. వాటికి పశుగ్రాసాన్ని పెంచేందుకు ఈనెల 15న ఐదో బోరు 600 ఫీట్ల వరకు వేయించినా నీరు రాలేదు. ఇప్పటివరకు ఐదు బోర్లకు రూ.మూడు లక్షలు కాగా.. బర్రెల నిర్వహణ ఇతర ఖర్చుల నిమిత్తం రూ.6 లక్షల వరకు అప్పులు అయ్యాయి. నీరు లేక జొన్న పంట ఎండిపోవడంతో దాన్ని బర్రెలకు మేపుతున్నా. ఆ పంట సాగుకు రూ. రూ.40 వేల వరకు ఖర్చు అయింది. రూ.6 లక్షల అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాక తీవ్ర మనోవేదనకు గురవుతున్నా. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

– పులుమామిడి పరమేశ్, సిద్ధులూరు, వికారాబాద్ మండలం

### ● తొమ్మిది బోర్లకు ఫ్లషింగ్ చేసినా లాభంలేదు



నాకు రంగారెడ్డి జిల్లా చౌదరిగూడ మండలం వీరన్నపేటలో నాలుగు ఎకరాల భూమి ఉండగా అందులో వరి సాగు చేసిన. వానకాలంలో నీళ్లు బాగా ఉండటంతో యాసంగిలోనూ మంచిగా పంట పడుతుందని భావించి మొత్తం వరి వేసిన. మార్చిలోనే ఎండలు ముదరడంతో బోరుబావుల్లోని నీరు ఇంకిపోయింది. పంటను కాపాడుకునేందుకు రూ.4 లక్షలకుపైగా అప్పు చేసిన. తొమ్మిది బోర్లను డ్రిల్ చేయించినా చుక్క నీరు రాలేదు. మండుతున్న ఎండలకు మూడు ఎకరాల్లోని పంట పూర్తిగా దెబ్బతిన్నది. ఎకరం వరిని కాపాడుకునేందుకు తాపత్రయపడుతున్నా. పంట బాగా పండితే చేసిన అప్పులు తీరుతాయని భావించిన. కానీ ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికే ఉన్న అప్పులతోపాటు ఇటీవల చేసిన రూ.4 లక్షల అప్పు ఎలా తీర్చాలో తెలుస్తలేదు. నన్ను ప్రభుత్వమే ఆదుకోవాలి.

– కావలి జంగయ్య, వీరన్నపేట, మం: చౌదరిగూడ



చిట్యాల మండలం వెల్మినేడులో ఎండిన పొలాన్ని పరిశీలించి రైతుతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి

# సారూ.. పంటలు పండేదెట్ల?

## ఓవైపు నీళ్లు లేవు.. మరోవైపు కరెంట్ సమస్య

- పంటలన్నీ ఎండుతున్నయ్.. పెట్టుబడి మీద పడ్డది
- బీఆర్ఎస్ హయాంలోనే పంటలు మంచిగ పండినయి
- కాంగ్రెస్ సర్కార్ మస్తు తిప్పలు పెడుతున్నది
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి ఎదుట రైతుల ఆవేదన

చిట్యాల, మార్చి 16 : ఓవైపు నీళ్లు లేవు.. మరోవైపు లోవోల్టేజీ సమస్యతో పంటలు ఎండుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెల్మినేడు గ్రామంలో ఎండిన వరి పొలాలను పరిశీలించడానికి నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆదివారం ఆ గ్రామంలో పర్యటించారు. ఎండిన వరి పొలాలను పరిశీలించి ఆ భూములకు సంబంధించిన రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు రైతులు పరిస్థితులను చిరుమర్తికి తమ సమస్యలను విన్నవించారు. రైతు మంకాల బాలయ్య మాట్లాడుతూ.. నాలుగున్నర ఎకరాల్లో వరి పంట వేయగా నీళ్లు లేక రెండున్నర ఎకరాలు ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. నాలుగు బోర్లు ఉంటే అందులో మూడు ఎండిపోయినట్టు తెలిపాడు. గతంలో ఎప్పుడూ ఇట్లాంటి పరిస్థితి రాలేదన్నాడు. మిగిలిన పొలాన్నైన బతికించుకోవడానికి రోజూ ట్యాంకర్‌కు రూ.1,500 ఇచ్చి నీళ్లు పోయిస్తున్నట్టు తెలిపాడు. లోవోల్టేజీ సమస్య వల్ల నాలుగు సార్లు మోటర్లు కాలిపోయాయని, ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక పోతున్నట్టు ఆవేదన చెందాడు. మరో రైతు ఏనుగు మల్లారెడ్డి మాట్లాడుతూ.. పొట్ట కొచ్చిన పంట ఎండిపోయిందని, చేసేదేమీ లేక జీవాలను మేపుతున్నట్టు తెలిపాడు. బోర్లలో నీళ్లు అడుగంటిపోయాయని, లోవోల్టేజీ సమస్యతో సతమతమవుతున్నట్టు చెప్పాడు. రెండెకరాల్లో వరి వేస్తే ఎకరంన్నర ఎండిపోయిందని, ఉన్న మూడు బోర్లలో నీళ్లు తగ్గినట్టు తెలిపాడు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఇలాంటి సమస్య రాలేదని అన్నాడు. కాంగ్రెస్ సర్కార్ మస్తు తిప్పలు పెడుతుందని ఆవేదన చెందాడు.

**సర్కార్ నిర్లక్ష్యంతోనే రైతులకు కష్టాలు..**

ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో ఉమ్మడి ఏపీలో ఉన్న విధంగా భూములు తిరిగి బీడుగా మారుతున్నాయని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. కాంగ్రెస్ అవగాహన రాహిత్యంతోనే చేతికొచ్చిన పొలాలు ఎండిపోతున్నాయని మండిపడ్డారు. రైతులు ఎకరానికి దాదాపు రూ.35 వేల వరకు ఖర్చు చేస్తే నీళ్లు లేక పంటలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిన పొలాలకు ఎకరాకు రూ.50 వేల నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి రైతు సంక్షేమాన్ని గాలికొదిలి ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని విమర్శించారు.

# రైతులు తిరగబడితే కాంగ్రెస్ సర్కారు గల్లంతే

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ
- రైతుల దీక్షకు సంఘీభావం



పెద్దలింగాపూర్‌లో రైతుల దీక్షకు సంఘీభావం తెలుపుతున్న జాన్‌వెస్లీ

ఇల్లంతకుంట రూరల్, మార్చి16 : రైతులు తిరగబడితే కాంగ్రెస్ సర్కారు గల్లంతవుతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ధ్వజమెత్తారు. రంగనాయకసాగర్ ఎల్‌ఎం–6 కెనాల్ కోసం రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌లో రిలేనిరాహారదీక్ష చేస్తున్న రైతులకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఎల్‌ఎం 6 కెనాల్ తవ్వేంత వరకు రైతుల పక్షాన పోరాడుతామని తెలిపారు. హామీలు అమలు చేయకుంటే కాంగ్రెస్ పతనం తప్పదని హెచ్చరించారు. ఈ నెలాఖరు వరకు ప్రజా సమస్యలు తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని, పరిష్కరించకుంటే ఉద్యమాలు చేస్తామని తెలిపారు.

# పచ్చని సేలు మాడుతున్నయ్

- వేసిన బోర్లూ ఎండిపోయాయి
- పంట పోయింది.. అప్పు మిగిలింది
- చేతికందాల్సిన పంట పశువుల పాలు
- రంగారెడ్డి జిల్లా అకాన్‌పల్లి రైతు ఆవేదన

బడంగ్‌పేట్, మార్చి 16 : సాగు నీళ్లు లేక రైతు కన్నీరు పెడుతున్నాడు. వేసిన పంటలు కండ్ల ముందే ఎండిపోతుంటే గుండెలు బాదుకుంటున్నాడు. పొట్టకు వచ్చిన వరి పంటకు నీళ్లు లేక పశువులకు వదిలేశాడు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం అకాన్‌పల్లి గ్రామానికి చెందిన చిన్న నరసింహ నాలుగు ఎకరాల్లో వరి పంట వేశాడు. పదేండ్ల క్రితమే నాలుగెకరాలు కౌలుకు తీసుకున్నాడు. పంటకు తోడుగా ఆరు బర్లను లోన్ ద్వారా తీసుకున్నాడు. వరి పంట తోపాటు బర్లకు కొంత మేత వేసుకున్నాడు. గతంలో మూడు బోర్లు ఉండగా కౌలుకు తీసుకున్న తర్వాత నరసింహ రెండు బోర్లు వేశాడు. ఐదు బోర్లు పూర్తిగా ఎండిపోవడంతో రైతు ఆందోళన చెందుతున్నాడు. ఇప్పటికే తెచ్చిన అప్పులు తీరలేదు. పంట ఎండిపోవడంతో పశువులకు వదిలేశాడు. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చు వచ్చిందని రైతు చెప్తున్నాడు. మహేశ్వరం మండ లంలో చాలాచోట్ల రైతులు ఇలాంటి పరిస్థితులనే ఎదుర్కొంటున్నట్టు తెలిపాడు.

**నా పరిస్థితి దయనీయం**



నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకున్నా. వేసిన ఐదు బోర్లు ఎండిపోయాయి. బర్లకు గడ్డి కూడా దొరుకుతలేదు. తెచ్చిన అప్పులు తీరలేదు. పిల్లలు కూలి పనులకు పోతున్నరు. మా ఆర్థిక పరిస్థితి బాగాలేదు. మా గోడు ఎవరు పట్టించుకుంటలేరు. నష్టపోయిన తమను ప్రభుత్వమే ఆదుకోవాలి.

– చిన్న నరసింహ, రైతు, అకాన్‌పల్లి



మహేశ్వరం మండలం అకాన్‌పల్లిలో పొలం ఎండిపోవడంతో గేదెలకు వదిలేసిన కౌలు రైతు చిన్న నరసింహ

### ● రుణమాఫీ ఇంకెప్పుడు చేస్తరు?



రుణమాఫీ ఇంకెప్పుడు చేస్తరు? అంటూ జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం మొగిలిపేట రైతులు ప్రశ్నిస్తున్నారు. పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులను చూపుతూ ఆదివారం గ్రామంలో నిరసన తెలిపారు. రూ.2 లక్షలలోపు రుణం తీసుకొని మాఫీ కాని రైతులు సుమారు 150 మంది ఉన్నారని, అలాగే రూ.2 లక్షలకుపైబడి రుణం తీసుకున్నవారు సుమారు 200 మందికిపైగా ఉన్నట్టు వారు స్పష్టం చేశారు. రుణమాఫీ కానివారి కోసం మొగిలిపేట మాజీ సర్పంచ్ వనతడపుల నాగరాజు ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి, రైతుల నుంచి సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో కూడిన దరఖాస్తులను తీసుకున్నారు. శిబిరంలో 54 మంది రైతులు దరఖాస్తులు అందజేయగా, వీటిని సోమవారం జగిత్యాల కలెక్టరేట్ ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని మాజీ సర్పంచ్ తెలిపారు.

– మల్లాపూర్



మహబూబ్‌నగర్ జిల్లా డోకూరు శివారులో ఎండిన వరిని పశువులకు మేతకు వదిలేసిన రైతు చంద్రమౌళి

# చేతికందే దశలో రైతుకు నీటిగోస

- 530 ఫీట్లు బోరేసినా కానరాని నీటిజాడ
- డోకూర్ పొలాలకు అందని కోయిల్‌సాగర్ నీరు



530 ఫీట్లు బోరు డ్రిల్లింగ్ చేసినా ఇంచు నీళ్లు మాత్రమే పడ్డాయని ఆవేదన చెందుతున్న రైతు చంద్రమౌళి

దేవరకద్ర, మార్చి 16 : మహబూబ్‌నగర్ జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టుగా పేరొందిన కోయిల్‌సాగర్ ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారింది. ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల కింద 52,250 ఎకరాల ఆయకట్టు ఉన్నది. ఎడమ కాల్వ పరిధిలో 20 వేల పైచిలుకు ఆయకట్టు ఉండగా.. ఈ యాసంగిలో దాదాపు 15 వేల ఎకరాల్లో రైతులు సాగుచేశారు. ఇటీవల జరిగిన వాటర్ బోర్డు సమావేశంలో ప్రాజెక్టు ఎడమ కాలువ కింద 4 వేల ఎకరాలు, కుడి కాలువ కింద 8 వేల ఎకరాలకు మాత్రమే నీళ్లివ్వాలని రెండు నెలల కిందట జరిగిన ఐడీబీ సమావేశంలో అధికారులు తీర్మానించారు. దీంతో ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీరు ఉన్నా పంటలకు వదలని పరిస్థితి. పంటలు చేతికొచ్చే దశలో నీళ్లలేక ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండేండ్ల కిందట పుష్కలమైన సాగునీటితో బంగారు పంటలు పండితే.. కాంగ్రెస్ హయాంలో నీళ్లు లేక పంటలు ఎండుతున్నాయని రైతులు వాపోతున్నారు. మూడు నెలలుగా చేసిన రెక్కల కష్టం వృథా అవుతుందని, రేయింబవళ్లు శ్రమించి వేసిన పంట చేతికందే దశలో చేజారిపోతున్నదని ఆవేదన చెందుతున్నారు.

**530 ఫీట్లు డ్రిల్ చేస్తే ఇంచు నీళ్లు..**

మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలం డోకూర్‌లో సాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నది. బోరుబావుల్లో చుక్క నీరు లేక కండ్ల ముందే పంటలు ఎండుతుంటే సాగు చేసిన రైతుల గుండె తరుక్కుపోతున్నది. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు ఎడమ కాలువ కింద చివరి ఆయకట్టు పరిధిలో నీళ్లు అందక పొలాలు ఎండిపోయే పరిస్థితి నెలకొన్నది. డోకూరుకు చెందిన రైతు చంద్రమౌళికి గ్రామ శివారులో ఉన్న 8 ఎకరాల్లో నాలుగు బోర్లు వేయగా.. రెండు బోర్లల్లో నీరు ఉండగా వరి పంట సాగు చేశాడు. నెల రోజులుగా భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోవడంతో పంటలను కాపాడుకునేందుకు వారం కిందట మరో బోరు 530 ఫీట్లు డ్రిల్లింగ్ చేయిస్తే ఒక ఇంచు నీళ్లు పడ్డాయి. నీళ్లు సరిపోక పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించింది. స్థానిక ఎమ్మెల్యే, ఇరిగేషన్ అధికారులకు స్థానిక రైతులతో కలిసి పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వాపోయాడు. ప్రాజెక్టులో నీళ్లున్నా విడుదల చేయకపోవడంతో నాలుగెకరాల్లో వరి పంట పూర్తిగా ఎండిపోయిందని ఆవేదన చెందుతున్నాడు.

### ఎండిన పంట చూస్తే ఏడ్పొస్తున్నది



నీళ్లు లేక పంటలు ఎండుతున్నాయని వికారాబాద్ జిల్లా కేంద్రానికి సమీపంలోని కొటాలగూడ గ్రామ రైతు పగిడాల జంగయ్య ఆవేదన వ్యక్తంచేస్తున్నాడు. ఎకరం పొలంలో జొన్న, అర ఎకరంలో చేమంతి సాగు చేస్తున్నామని, ప్రస్తుతం బోరు నుంచి నీరు సరిగ్గా రావడం లేదని చెప్తున్నాడు. రెండు నెలలుగా నీరందక జొన్న పంట సగం వరకు నేలకొరిగిందని ఆందోళన వ్యక్తంచేస్తున్నాడు. నీరు తక్కువగా ఉండటంతో చేమంతిని డ్రిప్పుతో సాగు చేస్తున్నట్టు తెలిపాడు. ఓవైపు నీరు పారితే మరో వైపు నీరు అందక మొక్కలు ఎండిపోతున్నాయని చెప్పాడు. నీళ్లు లేక పంటలు ఎండిపోతుంటే దుఃఖం వస్తుందని అంటున్నాడు రైతు జంగయ్య. ఇప్పటివరకు రూ.5 లక్షల వరకు అప్పు అయ్యిందని, తన బాధను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని ఆవేదన చెందుతున్నాడు.

– వికారాబాద్



మెదక్ జిల్లా చేగుంట మండలం ఇందుప్రియాల్ చౌరస్తా వద్ద రాస్తారోకో చేస్తున్న కసాన్‌పల్లి, పోతాన్‌పల్లి, మాచిన్‌సల్లి గ్రామాల రైతులు


# సాగునీటి కోసం రాస్తారోకో

## మెదక్ జిల్లా ఇందుప్రియాల్ చౌరస్తా వద్ద నిరసన

చేగుంట, మార్చి 16: సాగునీటి కోసం మెదక్ జిల్లా చేగుంట మండలంలోని ఇందుప్రియాల్ చౌరస్తా వద్ద ఆదివారం రైతులు రాస్తారోకో నిర్వహించారు. భూగర్భ జలాలు అడుగంటి బోరుబావుల నుంచి నీరురాక వేసిన పంటలు ఎండిపోతున్నాయని మండలంలోని కసాన్‌పల్లి, పోతాన్‌పల్లి, మాచిన్‌సల్లి, పెద్దశివునూర్ గ్రామాల రైతులు ఆందోళనకు దిగారు. రైతుల రాస్తారోకోతో చేగుంట–గజ్వేల్ ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. బోరు బావుల్లో నీళ్లు రావడం లేదని, ఏడు వందల ఫీట్లు బోరు తవ్వించినా నీళ్లు పడటం లేదని ఆందోళన వ్యక్తంచేశారు. ఫలితంగా పొట్ట దశలో ఉన్న వేల ఎకరాల్లో వరి పంట పోతున్నదని ఆవేదన చెందారు. ఎండిన పంటలు పశువులకు మేతగా మారుతున్నట్టు వాపోయారు. కొండపోచమ్మ సాగర్ కాలువ ద్వారా సాగునీరు అందించి పంటలను కాపాడాలని కోరారు. నీరివ్వకపోతే వంటావార్పు నిర్వహిస్తామని హెచ్చరించారు.



మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం గంట్లకుంటలో ఎండినపొలంలో దిగాలుగా ఉన్న రైతు పాయిలి శంకరయ్య



జనగామ మండలం పెంబర్తిలో నీళ్లులేక ఎండిపోయిన వరి పొలం

# దివ్యాంగుడి దాహం తీరేదెలా!



వాకర్‌తో వెళ్తేనే.. గొంతు తడిసేది..ఈ ఫొటోలోని దివ్యాంగుడి పేరు మాసు మల్లయ్య. ఇతనిది మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం షట్‌పల్లిలోని ఎస్సీ కాలనీ. స్థానికంగా ఉన్న బోరు బావి పాడైపోవడంతో పాటు మిషన్ భగీరథ నీరు సరఫరా కాక.. ఇదిగో ఇలా నిత్యం వాకర్ సాయంతో వెళ్లి సమీపంలోని వ్యవసాయ పంప్‌సెట్ నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నాడు. ఆరు నెలలుగా తాగు నీటికి గోస పడుతున్నామని, తమ సమస్యను పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

– కోటపల్లి

# 'భగీరథ'ను పట్టించుకోవడం లేదు

- నెల రోజులుగా తాగునీళ్లు అందక తల్లడిల్లిపోతున్నాం
- భద్రాద్రి జిల్లా దుబ్బ తండావాసులు ట్యాంకు ఎక్కి నిరసన



ఒంటి కాలితో వాటర్ ట్యాంకుపైకి చేరుకొని ఆందోళన చేస్తున్న దివ్యాంగ యువకుడు

జూలూరుపాడు, మార్చి 16: గత కేసీఆర్ ప్రభుత్వంలో తమ ఇళ్లకు శుద్ధజలాలు అందించిన మిషన్ భగీరథ ట్యాంకును కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ భద్రాద్రి జిల్లా జూలూరుపాడు మండలం కాకర్ల పంచాయతీ దుబ్బతండావాసులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ట్యాంకునకు నీళ్లు ఎక్కించే పైపులు పగిలి నెలరోజులు దాటుతున్నా ప్రభుత్వం పట్టించుకున్న పాపానపోలేదని ఆరోపిస్తున్నారు. ఆదివారం తండావాసులంతా కలిసి ఖాళీ బిందెలతో ట్యాంకు పైకి ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. కాలులేని ఓ దివ్యాంగ యువకుడు కూడా కర్ర సహాయంతో ఒంటికాలితో ట్యాంకుపైకి చేరుకొని నినాదాలు చేయడం తాగునీటి తీవ్రతకు అద్దం పడుతున్నది. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్.. తండావాసులతో ఫోన్‌లో మాట్లాడి, వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

# సీఎం రేవంత్‌కు నీటి సమస్య పట్టదా?

- దోచుకోవడం.. దాచుకోవడమే రేవంత్‌రెడ్డి పనా?
- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ఫైర్
- నీటి సమస్యపై ఎక్స్‌లో పోస్ట్



హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 16, (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో నీటి కష్టాలను పట్టించుకోకుండా సీఎం రేవంత్‌రెడ్డి దోచుకోవడం, దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారని కేఏ పాల్ విమర్శించారు. ఆదివారం ఎక్స్ వేదికగా ఆయన ఒక వీడియో పోస్టు చేశారు. 'పదేండ్లు సీఎంగా ఉంటానని రేవంత్ రెడ్డి గొప్పలు చెప్తున్నాడు. నేను నివాసముండే అమీర్‌పేట్ అపార్ట్‌మెంట్‌లో శనివారం కనీసం మంచినీళ్లు రాలేదు. ట్యాంకర్లతో నీటిని తెప్పించుకుంటున్నాం. కోటి 20 లక్షల జనాభా ఉన్న హైదరాబాద్‌లోనే ఈ పరిస్థితి ఉంటే, నాలుగు కోట్ల జనాభా ఉన్న రాష్ట్రం పరిస్థితి ఏంటి? మార్చి నెలలోనే ఇంత కరువు ఉంటే, ఏప్రిల్, మేలో ప్రజలు నీటి కోసం ఇబ్బందిపడాల్సిందేనా?' అని ప్రశ్నించారు. నేను వరంగల్‌లో పోటీ చేయకుండా నీకు మద్దతిచ్చి గెలిపిస్తే, నువ్వేమో బీజేపీ వాళ్లను గెలిపిస్తున్నావంటూ మండిపడ్డారు. పదిహేను నెలల రేవంత్‌రెడ్డి పాలనలో విద్యార్థులు, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా పట్టించుకోకుండా రాహుల్‌గాంధీకి మూటలు మోస్తున్నాడని ఆరోపించారు.